================================================================================
Language in India www.languageinindia.com ISSN 1930-2940 Vol. 17:12 December 2017
UGC Approved List of Journals Serial Number 49042
================================================================================

# తెలుగు దినపత్రికలలో వాక్యనిర్మాణం

## Telugu dinapatrikalalō vākyanirmāṇaṁ

Dr. Pammi Pavan Kumar, Associate Professor,
<pavankpammi@gmail.com>
Ms. K. Lavanya, Ph. D. Research Student,
<lavanyakumarik1993@gmail.com>
Department of Telugu, University of Hyderabad, Hyderabad – 500046, TS. India.
================================================================================

## 0. పరిచయం

దినపత్రికల భాషకు సంబంధించి ఇప్పటికే ఎన్నో పరిశోధనలు జరిగాయి. ఎన్నో పుస్తకాలు వచ్చాయి. అందులో వార్తారచన, ఆదాన పదాల అధ్యయనం, మాండలిక పదాల అధ్యయనం మొదలైన అనేక అంశాలకు సంబంధించిన పరిశోధనలు వచ్చాయి. వీటిల్లో పత్రికల భాషకు సంబంధించి కొన్ని విషయాలను ప్రస్తావించడం జరిగింది. తెలుగు దినపత్రికలలో వాక్యనిర్మాణాన్ని గురించి చర్చించడం ఈ వ్యాసోద్దేశం. దినపత్రికల భాషా ప్రయోగంలో కొన్ని విలక్షణమైన అంశాలున్నాయి. పదప్రయోగంలో, వాక్య నిర్మాణంలో గుర్తించదగిన విషయాలున్నాయి. వాటిలో స్వరూప, స్వభావ విభాగాలను అనుసరించి, వాక్యనిర్మాణ పరమైన కొన్ని విశేషాలను పరిచయం చేయడానికి ఈ పత్రం పరిమితమవుతున్నది.

## 1. వాక్యం – నిర్వచనం

తెలుగు వ్యాకర్తలు యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తి అనే లక్షణాలున్న పదసమూహాన్ని వాక్యమన్నారు. ("వాక్యము నా యోగ్యతాకాంక్షాసహితం బగునర్థముగల యాసత్తి యుక్తపదసముదాయంబు" సీతారామాచార్యులు, బహుజనపల్లి. 1996. వాక్య. ప. 1). యోగ్యత అంటే వాక్యంలోని పదాలు వాటి అర్థాల పరస్పర సంబంధంలో బాధ కలగకుండటం. ఆకాంక్ష అంటే వాక్యంలోని ఒక పదం యొక్క అర్థాన్ని గ్రహించిన తర్వాత తక్కిన పద, అర్థాలను తెలుసుకోవాలనే కోరిక. ఆసత్తి అంటే వాక్యంలోని పదాల మధ్య ఉండే అవ్యవధానత.

వాక్యానికి సంబంధించి యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తితోపాటు, వాక్యనిర్మాణ సంబంధాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలని భాషాశాస్త్రం చెబుతుంది. ఈ వాక్యనిర్మాణ సంబంధం మూడు రకాలు.

**అవి:** 1.1 స్థాన సంబంధం (Positional Relation)
1.2 యోగ్యతా సంబంధం (Relation of co-occurrence)
1.3 ఆదేశ సంబంధం (Relation of substitutability)

## 1.1 స్థాన సంబంధం (Positional Relation)

వాక్యంలో కొన్ని పదాలు కలిసినపుడు అవి నిర్దిష్టక్రమంలో మార్చడానికి వీలులేకుండా ఒక క్రమంలో అమరి ఉండడం "స్థానసంబంధం."

**ఉదా:** 'రెండు పెద్ద ఇళ్ళు' అన్న వాక్యంలోని పదాలను 'పెద్ద రెండు ఇళ్ళు' అని పదాల స్థానాన్ని మార్చి ప్రయోగిస్తే, అది అసాధు వాక్యం అవుతుంది. సంఖ్యావాచకం, విశేషణం ఒక నిర్మాణంలో భాగంగా ఉన్నప్పుడు సంఖ్యావాచకమే ముందు రావాలి అనేది ఇక్కడి నియమం.

## 1.2 యోగ్యతా సంబంధం (Relation of co-occurrence)

ఒక వాక్యంలో ఉండే పదాలకు మరికొన్ని పదాలను చేర్చవచ్చు లేదా తొలగించవచ్చు. అలా తొలగించినప్పుడు గానీ, చేర్చినప్పుడు గానీ ఆ వాక్యం ఉద్దేశించిన అర్థాన్ని ఇవ్వకపోవడమో, అన్య అర్థాన్ని ఇవ్వడమో జరుగుతుంది. దీనినే "యోగ్యతా సంబంధం" అంటారు.

**ఉదా:** 'రెండు పెన్నులు కావాలి' అనే వాక్యంలో 'రెండు' స్థానంలో 'ఇద్దరు' అనే పదాన్ని చేరిస్తే ఆ వాక్యం యొక్క అర్థం మారిపోతుంది. అప్పుడు 'రెండు పెన్నులు కావాలి' అనే వాక్యం 'ఇద్దరు పెన్నులు కావాలి' అనే వాక్యంగా మారుతుంది. ఇది వ్యాకరణ సమ్మతం కాని వాక్యం. ఇలా మార్చడం వల్ల వాక్యం యొక్క అర్థం మారిపోయింది.

## 1.3 ఆదేశ సంబంధం (Relation of substitutability)

ఒక వాక్యంలోని ఒక పదం స్థానంలో మరో పదాన్ని భాగం చేసి వాక్యనిర్మాణం చెడిపోకుండా మరికొన్ని వాక్యాలను నిర్మించవచ్చు. కానీ అర్థం మారుతుంది. దీనినే "ఆదేశ సంబంధం" అంటారు.

**ఉదా:** 'ఈ ఇల్లు పెద్దది' అనే వాక్యంలో 'ఇల్లు'కు బదులుగా చెట్టు, రాయి, బల్ల, కిటికీ మొదలైన పదాలు రావచ్చు. తిని, కొత్త అనే పదాలు రావు. కాబట్టి ఇల్లు, చెట్టు, రాయి మొదలైన పదాలు ఆదేశ సంబంధం కలిగి ఉన్నాయని గ్రహించాలి.

## 2. వాక్యభేదాలు

వాక్యాలను స్వరూపాన్ని బట్టి, స్వభావాన్ని బట్టి రెండు రకాలుగా విభజించవచ్చు. స్వరూపాన్ని బట్టి సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలని మూడు రకాలు. సామాన్య వాక్యంలో ఒకే ఆఖ్యాతముంటుంది. సామాన్యవాక్యానికి అసమాపక క్రియారూపాలు కలిగిన ఉపవాక్యాలు చేరిస్తే సంశ్లిష్ట వాక్యాలు ఏర్పడతాయి. కొన్ని సామాన్యవాక్యాలు ఒకదానితో ఒకటి చేరిస్తే సంయుక్త వాక్యాలేర్పడతాయి. స్వభావాన్ని బట్టి వాక్యాలు ఆశ్చర్యార్థక, ప్రశ్నార్థక, విధ్యర్థక, వ్యతిరేకార్థక, సందేహార్థక మొదలైన భాగాలుగా చేసి అనుశీలించవచ్చు.

**వాక్యభేధాలు**

**స్వరూపాన్ని బట్టి**

1. సామాన్యవాక్యాలు
2. సంశ్లిష్ట వాక్యాలు
3. సంయుక్త వాక్యాలు

**స్వభావాన్ని బట్టి**

1. ఆశ్చర్యార్థక వాక్యాలు
2. ప్రశ్నార్థక వాక్యాలు
3. విధ్యర్థక వాక్యాలు
4. వ్యతిరేకార్థక వాక్యాలు
5. సందేహార్థక వాక్యాలు

## 2.1 స్వరూప విభాగం

స్వరూపాన్ని బట్టి వాక్యాలు సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలు అని మూడు రకాలు.

### 2.1.1 సామాన్య వాక్యాలు (Simple Sentences)

కర్త, కర్మతోపాటు ఒక సమాపక క్రియ ఉండే వాక్యాల్ని "సామాన్య వాక్యాలు" అంటారు. సామాన్య వాక్యాలలో అసమాపక క్రియలు ఉండవు.

సామాన్య వాక్యాలను క్రియ ఆధారంగా రెండు రకాలుగా విభజించవచ్చు.

**అవి:** 2.1.1.1 క్రియారహిత వాక్యాలు

2.1.1.2 క్రియాసహిత వాక్యాలు

#### 2.1.1.1 క్రియారహిత వాక్యాలు

క్రియలేని వాక్యాలను “క్రియారహిత వాక్యాలు” అని అంటారు. అంటే, వాక్యంలో క్రియా పదం కనిపించదు. కానీ, వ్యవహర్తకు అర్థబోధ కలుగుతుంది.

**ఉదా:**

i. ఆయన ప్రజల మనిషి. పేదల నాయకుడు. గొప్ప వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి. (సాక్షి. 02-09-2017. పుట: 2)

ii. ఈయన పేరు తీగల సతీశ్. పెద్దపల్లి సమీపంలోని హన్మంతునిపేట. (సాక్షి. 02-09-2017. పుట: 2)

iii. ధాన్యం మన ప్రధాన ఆహారం. (నమస్తే. తె. 04-09-2017. పుట: 12)

iv. నేను భోజన ప్రియురాలిని. (ఈనాడు. 27-08-2017. పుట: 7)

v. అతడు 84 ఏళ్ల వృద్ధుడు. (ఆం. జ్యో. 04-07-2017. పుట: 12)

vi. ముఖేష్, నీతా అంబానీ దంపతులకు ఒక్కగానొక్క కూతురు. (నమస్తే. తె. 04-09-2017. పుట: 11)

vii. వీళ్ళిద్దరిలో ఒకరు తెలుగు అమ్మాయి. మరొకరు మలేసియా అమ్మాయి. (ఆం. జ్యో. 04-07-2017. పుట: 5) ఇటువంటి వాక్యాలు ఎక్కువగా శీర్షికలలో కనిపిస్తాయి.

**ఉదా:**

i. హైదరాబాదులో చెన్నై సిల్క్స్ మరో విక్రయ కేంద్రం. (ఈనాడు. 16-09-2017. పుట: 9)

ii. ప్రపంచస్థాయి ప్రాజెక్టుగా 'భగీరథ'. (ఈనాడు. 16-09-2017. పుట: 17)

iii. భూగర్భ రైలులో పేలుడు. (ఈనాడు. 16-09-2017. పుట: 11)

iv. రైతు విముక్తి కోసం యాత్ర. (నవ. తె. 16-09-2017. పుట: 4)

v. పలు జిల్లాల్లో భారీ వర్షం. (నవ. తె. 16-09-2017. పుట: 9)

vi. నైరుతి బలహీనత వల్లే పిడుగులు. (నవ. తె. 28-08-2017. పుట: 6)

### 2.1.1.2 క్రియాసహిత వాక్యాలు

క్రియ ఉన్న వాక్యాలను "క్రియాసహిత వాక్యాలు" అని అంటారు.

**ఉదా:**

i. కిన్నెరసాని జలశయానికి వరదనీరు **పెరుగుతుంది.** (ఆం. జ్యో. 04-07-2017. పుట: 2)

ii. మా ఊరి బడిని **కాపాడండి.** (ఆం. జ్యో. 04-07-2017. పుట: 3)

iii. ముంబైలో జరిగిన ప్రపంచపెట్టుబడిదారుల సదస్సులో 'మూడేళ్ల తెలంగాణ ప్రయాణం' అంశంపై **ప్రసంగించారు.** (ఈనాడు. 05-09-2017. పుట: 5)

iv. ఛత్తీస్ గఢ్ లోని బీజాపూర్ జిల్లాలో సోమవారం మావోయిస్టులు ఓ పోలీస్ కానిస్టేబుల్ ను నరికి **చంపారు.** (ఈనాడు. 05-09-2017. పుట: 5)

v. తమిళనాడు రాజకీయాలు వ్యూహప్రతివ్యూహాలతో **రక్తికడుతున్నాయి.** (ఈనాడు. 05-09-2017. పుట: 13)

### 2.1.2 సంశ్లిష్ట వాక్యాలు (Complex Sentences)

ఒకటి లేదా అంతకంటే ఎక్కువ అసమాపక క్రియలు ఉండి, ఒక సమాపక క్రియతో వాక్యం ముగిస్తే అలాంటి వాక్యాలను "సంశ్లిష్ట వాక్యాలు" అంటారు. సంశ్లిష్ట వాక్యాల్లో క్త్వార్థకం, శత్రర్థకం, చేదర్థకం, అప్యర్థకం మొదలైన అసమాపక క్రియలు ప్రధానపాత్ర వహిస్తాయి.

#### 2.1.2.1 క్త్వార్థకం ప్రయుక్తమైన సంశ్లిష్ట వాక్యాలు

భూతకాలిక అసమాపక క్రియ (క్త్వార్థకం)ను ప్రయోగించి సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా మార్చవచ్చు. ఈ వాక్యాల్లో ధాతువుకు 'ఇ' అనే ప్రత్యయం చేరుతుంది. భూతకాలిక అసమాపక క్రియ ప్రధాన క్రియ కంటే ముందు జరిగిన పనిని గురించి వివరిస్తుంది.

**ఉదా:**

i. ఉప్పు తప్ప ఆహార పదార్థాలన్నీ పెరటిలోనే పండించుకొని మనం ఆరోగ్యంగా ఉంటూ ఇతరులకు ఆరోగ్యాన్నివ్వాలనే లక్ష్యంతో పల్లెకు **వచ్చి** వ్యవసాయాన్ని ఎంచుకున్నా. (ఆం. జ్యో. 01-08-2017. పుట: 2)

ii. సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో **ఊరేగి** భక్తులకు దర్శనమిచ్చారు. (నమస్తే. తె. 04-08-2017. పుట: 9)

iii. 2019 ఎన్నికల్లో రాజకీయ సన్యాసం తప్పదని **భావించి**, ఉనికి కోసం రైతుల నోట్లో మట్టికొట్టే విధంగా వ్యవహరించడం తగదని హితువు పలికారు. (నమస్తే. తె. 04-09-2017. పుట: 6)

iv. నల్లగొండజిల్లా నిడమనూరుకు చెందిన బంగారయ్య (65) వాగుకు మోటారు **వేసి** వ్యవసాయం చేస్తున్నాడు. (సాక్షి. 02-09-2017. పుట: 12)

v. మహాబలి చేసిన పనులకు **మెచ్చి**, తనతో ఎంతో అనుబంధం ఉన్న ప్రజలను ఏడాదికి ఒకసారి కలుసుకునేటట్లు విష్ణుమూర్తి అతనికి వరమిచ్చాడు. (మన. తె. 04-09-2017. పుట: 5)

#### 2.1.2.2 శత్రర్థకం ప్రయుక్తమైన సంశ్లిష్ట వాక్యాలు

వర్తమానకాల అసమాపక క్రియ (శత్రర్థకం)ను ప్రయోగించి సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా మార్చవచ్చు. ఈ వాక్యాలు ఏక కర్తృకంగా ఏకకాలంలో జరిగిన పనిని తెలియజేస్తాయి.

**ఉదా:**

i. వాళ్ళు పాతికేళ్ళ క్రితమే విద్యుత్ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా చేరారు. పర్మనెంట్ చేస్తారన్న ఆశతోనే తమ ప్రాణాలతో **చెలగాటమాడుతూ** ఉన్నతాధికారులు చెప్పే రిస్క్ పనులన్నీ చేస్తున్నారు. (ఆం. జ్యో. 01-08-2017. పుట: 1)

ii. శుక్రవారం సిద్ధిపేట జిల్లాకేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన **మాట్లాడుతూ** పదవులు త్యాగం చేసి, ఎన్నో ఉద్యమాల ద్వారా పోరాడి సాధించిన తెలంగాణను అద్భుతంగా తీర్చిదిద్దాలని కేసీఆర్ ప్రయత్నిస్తుంటే కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అడ్డుపడుతున్నారని చెప్పారు. (నవ. తె. 05-08-2017. పుట:01)

iii. విజయవాడలో రాష్ట్రప్రభుత్వం అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నన్నపనేని రాజకుమారి **మాట్లాడుతూ** ఈ విషయమై తాను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, డిజీపి సాంబశివరావును కలిసి గౌతం సవాంగ్ స్థానంలో ఒక మహిళా అధికారిని పర్యవేక్షకురాలిగా నియమించాలని కోరతామన్నారు. (వార్త. 07-08-2017. పుట: 5)

iv. పెండింగ్ వేతనాలు అమలు చేయాలని **కోరుతూ** రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిరాహార దీక్షలను చేపట్టారు. (సాక్షి. 02-09-2017. పుట: 12)

### 2.1.2.3 చేదర్థకం ప్రయుక్తమైన సంశ్లిష్ట వాక్యాలు

ధాతువుకు '-తే', '-ఇతే' ప్రత్యయాలు చేరితే చేదర్థక రూపం ఏర్పడుతుంది. చేదర్థక క్రియ ఉన్నప్పుడు ప్రధాన వాక్యంలో భవిష్యత్ కాలాన్ని బోధించే క్రియ ఉంటుంది.

**ఉదా:**

i. తెలంగాణ **వస్తే** ఇంటికో ఉద్యోగం ఇస్తామంటూ నమ్మబలికిన ముఖ్యమంత్రి కేసీఆర్... ఇప్పటివరకూ ఆ వాగ్దానాన్ని నెరవేర్చలేదని తెలంగాణ సామాజిక, ప్రజాసంఘాల ఐక్యవేదిక (టీ మాస్ ఫోరం) విమర్శించింది. (నవ. తె. 04-08-2017. పుట: 1)

ii. హుస్సేన్ సాగర్ లో మరో అర అడుగు నీరు **చేరితే** నిండనున్నది. సాగర్ పొంగిపొర్లినా ఎటువంటి ఇబ్బందీ లేదని బల్దియా పేర్కొన్నది. (నమస్తే. తె. 18-07-2017. పుట: 6)

iii. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను **చేపడితే**, కోర్టులు, గ్రీన్ ట్రైబ్యునళ్ళలో కేసులు వేస్తూ ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని, వారిని ప్రజలు తరిమి కొట్టాలని మంత్రి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. (ఆం. జ్యో. 06-08-2017. పుట: 3)

iv. ఎవరు డబ్బులు **చెలిస్తే** వారికి అనుకూలంగా మార్పులు, చేర్పులకు అవకాశం ఉండడంతో గొడవలు జరుగుతున్నాయి. (మన. తె. 04-09-2017. పుట: 2)

v. రాబోయే ఎలక్షన్లలో యువత భాగస్వామ్యం ఎంత **పెరిగితే**... అంత ప్రభావవంతమైన తీర్పు వస్తుందని రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పలువురు విద్యావంతులు పేర్కొన్నారు.
(నవ. తె. 29-08-2017. పుట: 7)

vi. ప్రభుత్వం మంజూరు చేసిన పోస్టుల కన్నా ఎక్కువ సంఖ్యలో అధికారులు **వస్తే** ఎలా సర్దుబాటు చేస్తారో వేచి చూడాల్సిఉంది. (మన. తె. 04-09-2017. పుట: 2)

### 2.1.2.4 అప్యర్థకం ప్రయుక్తమైన సంశ్లిష్ట వాక్యాలు

ఈ వాక్యం ప్రతిపాదించే రెండు వ్యాపారాల్లో వైరుధ్యం ఉంటుంది. ధాతువుకు '-ఇనా' అనే ప్రత్యయం చేరి ఇటువంటి వాక్యాలేర్పడతాయి.

**ఉదా:**

i. మాఫియా ఆగడాలను అరికట్టడానికి, పర్యావరణాన్ని కాపాడటానికి సుప్రీంకోర్టు, కేంద్ర పర్యావరణ శాఖ మార్గదర్శకాలను జారీ **చేసినా** వాటిని ఇక్కడ అమలు చేయడం లేదు. (నవ. తె. 11-08-2017. పుట: 10)

ii. మొదటి నుంచి నాకు సంగీతంలో పైకి రావాలని కోరిక ఉండేది. అందుకే స్వదేశం **వీడినా**... సంగీతంపై నాకున్న దాహం మాత్రం పోలేదు. (ఆం. జ్యో. 01-08-2017. పుట: 5)

iii. రుతుపవనాలు ఆలస్యంగా **విస్తరించినా** జూన్ లో మంచి వర్షాలు కురిశాయి. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ కు ఢోకా ఉండదని నిపుణులు భావించారు. (ఆం. జ్యో. 01-08-2017. పుట:11)

iv. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాకరంగా సాగుతున్న పోలవరం పనులు వర్షాలు వరదలు కారణంగా ప్రస్తుతానికి **నెమ్మదించినా** నవంబర్ నెల నుండి వేగంగా సాగేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. (వార్త. 07-08-2017. పుట: 5)

v. ఖరీఫ్ పంటల సాగు ముగింపు దశకు చేరుకున్నా కూడా పంటరుణాలు అందడం లేదు. ఇప్పటివరకు ఖరీఫ్ సాగు 81 శాతం **పూర్తయినా**... రుణాల మంజూరు మాత్రం లక్ష్యంలో సగానికే పరిమితం కావడం గమనార్హం. (సాక్షి. 02-09-2017. పుట: 2)

### 2.1.3 సంయుక్త వాక్యాలు (Compound Sentences)

రెండుగాని అంతకంటే ఎక్కువ సామాన్య వాక్యాలు కలిసి ఒక వాక్యంగా ఏర్పడితే దాన్ని "సంయుక్త వాక్యం" అంటారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ సమాన ప్రతిపత్తి గల వాక్యాలు కలిసి ఒకే వాక్యంగా ఏర్పడితే అది సంయుక్త వాక్యమవుతుంది.

వాక్య సంయోజనాన్ని సూచించడానికి ఇంగ్లీషులో and, or, but వంటి సముచ్చయాలు సహకరిస్తాయి. హిందీలో ఔర్, యా, మగర్ వంటి శబ్దాలు చేరితే సంయుక్త వాక్యాలేర్పడతాయి. తెలుగులో రెండు వాక్యాలను సంయుక్త వాక్యంగా మార్చేటప్పుడు వాక్యంలోని పదాంతాలు దీర్ఘాలు అవుతాయి.

**ఉదా:**

i. సరయూ తెలివైనది. సరయూ అందమైనది. (సామాన్య వాక్యాలు)

సరయూ తెలివైనదీ, అందమైనదీ. (సంయుక్త వాక్యం)

ii. తిలక్ కవిత్వం రాస్తాడు. తిలక్ కథలు రాస్తాడు. (సామాన్య వాక్యాలు)

తిలక్ కవిత్వమూ, కథలూ రాస్తాడు. (సంయుక్త వాక్యం)

iii. వసంత పాటలు రాస్తుంది. వసంత పాటలు పాడుతుంది. (సామాన్య వాక్యాలు)

వసంత పాటలు రాస్తుందీ, పాడుతుందీ. (సంయుక్త వాక్యం)

రెండు వాక్యాల మధ్య ఏ ప్రత్యయాలూ లేకపోయినా ఒక సంకలన సంబంధం గుర్తించడానికి అవకాశం ఉంది.

**ఉదా:**

i. ఒకే రకమైన వాతావరణంలో ఇద్దరు పిల్లలు భిన్న ధృవాలుగా ప్రవర్తించడం, భిన్నమైన మనస్కులుగా ఉండడమనేది చాలా సహజమైన పరిణామాలు. (నమస్తే, తె. 05-09-2017. పుట: 13)

ii. కళాక్షేత్రంలో నాట్యశాస్త్రంతో పాటు, భరతనాట్య కళాకారులు అభినయ దర్పణం, సంగీత రత్నాకరాలను అధ్యయనం చేస్తారు. (నవ. తె. 29-09-2017. పుట: 11)

iii. చివరికి హత్య, అత్యాచారం, లైంగిక వేధింపుల కేసుల్లో స్వామి ప్రేమానంద జైలు పాలయ్యారు. (ఈనాడు. 27-08-2017. పుట: 12)

iv. హైదరాబాదుకు చెందిన ఒక సాఫ్ట్ వేర్ ఉద్యోగికి 20 ఏళ్ళ అనుభవముంది. ప్రాజెక్టుల ప్రోగ్రామ్ లు రాయడం, నిర్వహించడంలో మంచి సమర్థత ఉంది. (ఈనాడు. 14-09-2017. పుట: 1)

v. అత్యాచారానికి, లైంగిక వేధింపులకు గురైన బాలికలు శారీరకంగా, మానసికంగానే కాకుండా సామాజిక సమస్యలనూ ఎదుర్కొంటున్నారు. (ఈనాడు. 16-09-2017. పుట:1)

vi. శుచిగా వండటం, శుభ్రంగా ఉండటం భారతీయ సంస్కృతి.
(ఈనాడు. 16-09-2017. పుట: 7)

vii. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. (నవ. తె. 29-08-2017. పుట:9)

వికల్పార్థాన్ని చెప్పాల్సి వచ్చినప్పుడు ‘ఓ’ శబ్దం చేరుతుంది.

**ఉదా:**

i. సూకికి నోబుల్ ప్రైజ్ ఎలా ఇచ్చారో.. ఎందుకిచ్చారో అర్థం కావడంలేదన్నారు. (ఈనాడు. 16-09-2017. పుట: 6)

ii. ఏం తినాలో, ఏ బట్ట కట్టాలో, ఎలా పెండ్లి చేసుకోవాలో ఢిల్లీ నుంచే నిర్ణయిస్తున్నారు. (నవ. తె. 16-09-2017. పుట:8)

iii. యునెస్కో వంటి ప్రపంచ స్థాయి గుర్తింపు కోసం ప్రయత్నం చేస్తున్నారు. కానీ అంతటి అంతర్జాతీయ గుర్తింపు కోసం మనం ఎంతవరకు ఆలయాల, కట్టడాల అభివృద్ధికి కృషి చేస్తున్నామో, వాటిని ఏ రకంగా కాపాడుతున్నామో అధికారులు అత్మవిమర్శ చేసుకోవాలి. (నవ. తె. 16-09-2017. పుట:4)

రెండు వాక్యాలు ప్రతిపాదించే విషయాల మధ్య వైరుధ్యమున్నప్పుడు ఆ రెండు వాక్యాల మధ్య ‘కానీ’ అనే శబ్దం చేరుతుంది.

**ఉదా:**

i. కంపెనీ లాభాల గురించి ఆలోచించాలని, **కానీ** కార్మికులను ముంచేలా ఆలోచనలు ఉండకూడదని సిఎంఓఏఐ విజ్ఞప్తి చేసింది. (మన, తె. 04-09-2017. పుట: 2)

ii. పట్టాదార్ పాస్ పుస్తకంలో నమోదైన వివరాల ప్రకారం భూమి సదరు సర్వే నెంబరులో ఉండాలి. **కానీ** మరో సర్వేనెంబరులో ఉంటున్నాయి.(మన, తె. 04-09-2017. పుట: 2)

iii. మంత్రివర్గ మార్పులలో మిత్రపక్షాలకు చోటు దక్కకపోవచ్చు. **కానీ** సంకీర్ణ ప్రభుత్వమైనందువల్ల కనీస మర్యాద అయినా దక్కుతున్నదా అనే అనుమానం కలుగుతున్నది.
(నమస్తే, తె. 05-09-2017. పుట: 4)

iv. ఏ ఉత్పత్తి అయినా కార్మికశక్తిపై ఆధారపడి ఉంటుంది. **కానీ** సింగరేణిలో సీన్ రివర్స్ అవుతోంది. (సాక్షి. 06-09-2017. పుట: 14)

v. నిజానికి నేను సైకిల్ ను ఎంచుకోడానికి ముఖ్యకారణం పర్యావరణానికి మేలు చేయాలన్న చిన్న కోరిక. **కానీ** ఒక్కసారి ప్రారంభించాక పూర్తిగా అలవాటుపడిపోయాను. (ఈనాడు. 16-09-2017. పుట: 7)

vi. చదువులో పిల్లల తెలివికి మురిసిపోతారు. **కానీ**... దురలవాట్లు దాచే అతితెలివిని పసిగట్టే సమయం, ఓపిక పెద్దలకు ఉండటం లేదు. (ఆం. జ్యో. 07/07/2017. పుట: 5)

vii. కలుపు తీయాలన్నా... దుక్కి దున్నాలన్నా... ఎడ్లుండాలి. **కానీ** దొరకడం కష్టంగా మారింది. (ఆం. జ్యో. 07-07-2017. పుట: 10)

## 2.2 స్వభావ విభాగం

స్వభావం ఆధారంగా వాక్యాలను ఆశ్చర్యార్థక, ప్రశ్నార్థక, విధ్యర్థక, వ్యతిరేకార్థక, సందేహార్థక వాక్యాలుగా విభజించి, పరిశీలించడం జరిగింది.

### 2.2.1 ఆశ్చర్యార్థక వాక్యాలు

ఆశ్చర్యభావాన్ని వ్యక్తంచేసే వాక్యాలను "ఆశ్చర్యార్థక వాక్యాలు" అంటారు. దినపత్రికల్లో ఆశ్చర్యార్థక వాక్యాలు అనేక రకాలుగా కనిపిస్తాయి.

సామాన్య వాక్యాలపై '-ఆ' చేరి ఆశ్చర్యార్థక వాక్యాలేర్పడతాయి.

**ఉదా:**

i. కొత్త జిల్లాలా... పాత జిల్లాలా...! (నవ. తె. 11-08-2017. పుట: 6)
ii. బయటకు వెళ్తున్నారా! (నవ. తె. 11-08-2017. పుట: 5)
iii. యూవీకి చోటు దక్కేనా! (నమస్తే. తె. 13-08-2017. పుట: 10)
iv. 91 ఏళ్ళకు డిగ్రీ పట్టా! (నమస్తే. తె. 13-08-2017. పుట: 13)

నిశ్చయార్థక వాక్యాన్ని ఆశ్చర్యార్థక చిహ్నం ద్వారా సూచించిన వాక్యాలు పత్రికల్లో కనిపిస్తాయి.

**ఉదా:**

i. పరుగుల రారాజుకు వీడ్కోలు నేడే! (ఈనాడు. 12-08-2017. పుట: 17)
ii. సైన్యంలోకి రోబోలు! (నవ. తె. 13-08-2017. పుట: 1)
iii. బతికే అవకాశమున్న ఏ ప్రాణమూ పోకూడదు! (ఈనాడు. 12-08-2017. పుట: 20)
iv. రెండోరోజు ఎంత స్కోరు చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది!
(నమస్తే. తె. 13-08-2017. పుట: 10)
v. భారత్, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం! (మన. తె. 14-08-2017. పుట: 11)
vi. ఈ రోబో ట్రాఫిక్ రూల్స్ పాటిస్తుంది! (సాక్షి. 03-09-2017. పుట: 3)

### 2.2.2 ప్రశ్నార్థక వాక్యాలు

ప్రశ్నార్థక వాక్యాలు రెండు రకాలు.

**అవి:** 2.2.2.1 విషయాపేక్షక ప్రశ్నలు

2.2.2.2 విషయ నిర్ధారక ప్రశ్నలు

### 2.2.2.1 విషయాపేక్షక ప్రశ్నలు

'-ఆ' అనే ప్రత్యయం వాక్యాంతంలో చేరడం వల్ల విషయాపేక్షక ప్రశ్నలు ఏర్పడతాయి.

**ఉదా:**

i. కొత్త పరికరాలను ఎలా ఉపయోగించాలో నేర్చుకుంటున్నారా? (ఈనాడు. 15-08-2017. పుట: 17)
ii. జనం ప్రాణాలకంటే మాఫియానే ముఖ్యమా? (నవ. తె. 11-08-2017. పుట: 3)
iii. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లేదా? (నవ. తె. 12-08-2017. పుట: 4)
iv. నిద్రలేమితో బాధపడుతున్నారా? (నవ. తె. 12-08-2017. పుట: 5)
v. హిందువులుగా భావించబడుతున్న వారందరూ ఒకే ఆచారాలతో ఉన్నారా? (నవ. తె. 11-08-2017. పుట: 4)

ప్రశ్నవేస్తూ, దానికి సమాధానంతో మరో ప్రశ్న వేసే వాక్యాలు మనకు పత్రికల్లో కనిపిస్తాయి.

**ఉదా:**

i. ఈ ప్రమాదాలకు ఎవరు కారణం? ఇసుక మాఫియానా? (నవ. తె. 11-08-2017. పుట: 4)
ii. ఎముకలు విరిగేలా కొట్టడం, మూత్రం నుండి రక్తం వచ్చేలా కొట్టడానికి వాళ్ళు లారీలతో మనుషులను చంపారా? ఓ... చలాన్లు కట్టి మనిషి ప్రాణాలు తీసిన లారీలను తగలబెట్టారు అనా? (నవ. తె. 28-08-2017. పుట: 7)
iii. మన పురాతన కావ్యాల్లో లాగా, మహిమల పేరుతో వావి వరుసలు లేకుండా ప్రవర్తిస్తే సమాజం ఒప్పుకుంటుందా? శిక్షించకుండా వదిలేస్తుందా? వదిలేయదు కదా? (నవ. తె. 01-12-2017. పుట: 4)

### 2.2.2.2 విషయ నిర్ధారక ప్రశ్నలు

విషయాన్ని నిర్ధారణ చేసుకోవడానికి అడిగే ప్రశ్నలను "విషయ నిర్ధారక ప్రశ్నలు" అంటారు.

**ఉదా:**

i. మంత్రి కేటీఆర్ పై విలేకరులు ఎన్నికల కమిషనర్ కు ఫిర్యాదు చేశారు కదా... ? (నవ. తె. 03-08-2017. పుట: 3)
ii. మీ తల్లి చైనా నుంచి వచ్చారు కదా? (మన. తె. 01-08-2017. పుట: 12)

iii. నెల ముందో లేక నెల తర్వాతో చేపట్టి ఉండవచ్చు కదా? (మన. తె. 03-08-2017. పుట: 9)

### 2.2.3 విధ్యర్థక వాక్యాలు

విధులు, ఆజ్ఞలు మొదలైన వాటిని తెలియజేసే వాక్యాలను "విధ్యర్థక వాక్యాలు" అంటారు. ఈ వాక్యాలలో క్రియ తర్వాత 'ఆలి' అనే సహాయక క్రియరూపం చేరుతుంది.

**ఉదా:**

i. నీట్ కు కామన్ ప్రశ్నాపత్రం ఉండాల్సిందే. (నవ. తె. 11-08-2017. పుట: 2)

ii. బదిలీల్లో వితంతువులకు అవకాశమివ్వాలి. (నవ. తె. 11-08-2017. పుట: 6)

iii. ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. (నవ. తె. 03-08-2017. పుట: 3)

iv. గ్రామ కమిటీలో 15 మందిని అదే గ్రామ పరిధి నుంచి ఎంపిక చేయాలి. (ఈనాడు. 05-09-2017. పుట: 1)

### 2.2.4 వ్యతిరేకార్థక వాక్యాలు

వ్యతిరేక భావాల్ని తెలిపే వాక్యాలను "వ్యతిరేకార్థక వాక్యాలు" అంటారు. సాధారణంగా 'లేదు' అన్న శబ్ద ప్రయోగం వ్యతిరేకార్థక వాక్యంలో ఉంటుంది.

**ఉదా:**

i. సుంకం రహిత దిగుమతి ఆలోచన **లేదు.** (నమస్తే. తె. 13-08-2017. పుట: 7)

ii. గతంలో గ్రామీణ ప్రాంతంల్లో ఇంటింటికి వెళ్ళి వారికి సోకుతున్న వ్యాధుల గురించి వివరాలు సేకరించి కొన్ని మందులు కూడా ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ కార్యక్రమాలు ఏ మాత్రం జరగడం **లేదు.** (వార్త. 18-08-2017. పుట: 4)

iii. విపక్షాలు ప్రవేశపెట్టిన కీలక బిల్లు పాస్ కావటంతో అధికార పక్షానికి మింగుడుపడటం **లేదు.** (నవ. తె. 01-08-2017. పుట: 1)

iv. మందు సర్వాంతర్యామిగా మారింది. ఇప్పుడు గిరిజన ప్రాంతాలనూ వదల**లేదు.** (నవ. తె. 16-09-2017. పుట: 4)

v. వానాకాలమైనా హైదరాబాద్ మహానగరంలో కొన్ని ప్రాంతాల్లో నీటి ఎద్దడి తప్పడం **లేదు.** (ఈనాడు. 31-08-2017. పుట: 1)

### 2.2.5 సందేహార్థక వాక్యాలు

'–ఒ'/'–ఓ' అనే సందేహార్థక పదకల్పకావ్యయాలు చేరిన వాక్యాలను "సందేహార్థక వాక్యాలు" అంటారు.

**ఉదా:**

i. చక్కెర ఫ్యాక్టరీ తెరిచేదెన్నడో? (మన. తె. 14–08–2017. పుట: 7)

ii. మూడో సెంచరీ చేస్తాడేమో! (ఈనాడు. 12–08–2017. పుట: 17)

iii. విడవమంటే పాముకు కోపం... తినమంటే కప్పకు కోపం అంటే ఇదేనేమో! (నవ. తె. 13–08–2017. పుట: 4)

iv. సమస్య హైకోర్టు గడపతొక్కి ఉండకపోతే ఈ మాత్రం కూడా మంత్రి పరామర్శ ఉండేది కాదేమో! (నవ. తె. 11–08–2017. పుట: 4)

## 3. అనుకృతి వాక్యాలు

ఈ అనుకృతి వాక్యాలు దినపత్రికలలో ఎక్కువగా కనిపిస్తాయి. రాజకీయ నాయకులు లేదా ఇతర వ్యక్తులు చెప్పే విషయాలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అనుసరించి రాసిన వాక్యాలు ప్రతిరోజు దినపత్రికలలో కనిపిస్తాయి. అనుకృతి రెండు రకాలు

**అవి:** 3.1 ప్రత్యక్షానుకృతి

3.2 పరోక్షానుకృతి

### 3.1 ప్రత్యక్షానుకృతి

ఒకరు చెప్పిన విషయాన్ని యథాతథంగా ఉన్నది ఉన్నట్లుగా చెప్పడం ప్రత్యక్షానుకృతి.

**ఉదా:**

i. "సాగునీరు... తాగునీరు... రోడ్ల వంటి ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే పనులపై జీఎస్టీ విధించడం అన్యాయం. ప్రభుత్వ కాంట్రాక్టు పనులపై జీఎస్టీ ఎత్తేయండి. కనీసం 5 శాతానికి తగ్గించండి. ఒక్క తెలంగాణకు మాత్రమే కాదు... అన్ని రాష్ట్రాలకూ ఇది భారమే" అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ సాక్షాత్తూ ప్రధానమంత్రి మోదీకి విన్నవించారు.(ఆం. జ్యో. 06–08–2017. పుట: 1)

ii. ఐరాసలో చైనా రాయబారి జేయి మాట్లాడుతూ... "ద. కొరియాలో క్షిపణి రక్షణ వ్యవస్థ 'థాడ్' ఏర్పాటుచేయడం చాలా పెద్ద తప్పు. ఉ. కొరియా సంక్షోభ పరిష్కారానికి ఇదెంత మాత్రమూ దోహదం చేయదు. ఆ దేశ సరిహద్దు వెంబడి సైన్యాన్ని మోహరించి బెదిరింపుకు పాల్పడుతున్నారు. ఆంక్షలు విధింపు వల్ల సమస్య మరింత పెరుగుతుంది" అని అన్నారు. (నవ. తె. 07–08–2017. పుట: 2)

iii. 'దాదా మీరు నాకు తండ్రిలాంటివారు. నన్ను ముందుకు నడిపించిన మార్గదర్శి' అని పేర్కొంటూ ప్రధాని మోదీ మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి లేఖ రాశారు. (నమస్తే. తె. 04-08-2017. పుట:5)

### 3.2 పరోక్షానుకృతి

అనుకృతాంశంలోని శబ్దాలను యథాతథంగా కాకుండా విషయాన్ని మాత్రమే అనుకరించటం పరోక్షానుకృతి.

**ఉదా:**

i. పండ్లపై ఉన్న రసాయనాల వల్ల మా కూతురికి లివర్ వ్యాధి వచ్చిందని వైద్యులు చెప్పారు. (ఆం. జ్యో. 06-08-2017. పుట: 2)

ii. యావత్ తెలంగాణ ప్రజల బతుకు చెరువులతో ముడిపడి ఉందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి టి. హరీశ్ రావు అన్నారు. (ఆం. జ్యో. 06-08-2017. పుట: 6)

iii. దేశరాజకీయాల్లో స్వేచ్ఛ వచ్చింది కానీ, సాంస్కృతిక రంగంలో ఇంకా రాలేదని ప్రఖ్యాత కవి గుల్జార్ అన్నారు. (వార్త. 07-08-2017. పుట: 2)

## 4. యత్తదర్థక వాక్యాలు

దినపత్రికలలో ఈ వాక్యాల ప్రయోగం తక్కువగా కనిపిస్తోంది. ఎందుకంటే తెలుగు భాషకు ఈ ప్రయోగాలు సహజాలు కావు.

**ఉదా:**

**i.** **ఎక్కడైతే** మొదలవుతుందో.. **అక్కడే** ఆపితే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. (వార్త. 18-08-2017. పుట: 2)

**ii.** **ఎప్పుడైతే** వాళ్ళు మనకు దూరం అవుతారో **అప్పుడే** తెలుస్తోంది. (నవ. తె. 18-07-2017. పుట: 8)

**iii.** '**నాకు** దక్కనిది... **ఎవరికీ** దక్కనివ్వను... ' (నవ. తె. 05-08-2017. పుట: 2)

## 5. సంప్రదించిన గ్రంథాలు

1. కుమారదేవి, సుంకర. 1983. **తెలుగు వార్తా పత్రికల్లో భాషా స్వరూప ప్రయోగాలు.** అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి. సిద్ధాంత గంథం.

2. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2014. **తెలుగు భాషాచరిత్ర.** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. (మొదటి ముద్రణ:1975)

3. కృష్ణమూర్తి, భద్రిరాజు.2014. **భాష, సమాజం, సంస్కృతి.** హైదరాబాదు: నీల్ కమల్ పబ్లికేషన్స్. (మొదటి ముద్రణ:2000)
4. నారాయణ రెడ్డి. సి. (ప్ర. సంపా). 2016. **తెలుగు పత్రికలు, ప్రసార మాధ్యమాల భాషా స్వరూపం.** హైదరాబాదు: తెలంగాణ సారస్వత పరిషత్తు.
5. పవన్ కుమార్, పమ్మి. 2003. **కట్టా వరదరాజు ద్విపద రామాయణం: భాషా పరిశీలన.** హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి. సిద్ధాంత గ్రంథం.
6. రామారావు, చేకూరి. 2002. **తెలుగు వాక్యం.** హైదరాబాదు: స్వీయ ప్రచురణ. (ప్రథమ ముద్రణ: 1975)
7. రాధాకృష్ణ, బూదరాజు. 1981. **ఈనాడు భాషాస్వరూపం**. హైదరాబాదు: ఉషోదయా పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్.
8. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 1996. **ప్రౌఢ వ్యాకరణము.** గుంటూరు: టెక్నికల్ పబ్లిషర్స్.
9. సుబ్రహ్మణ్యం, పి.యస్. 2015. **ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు.** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. (మొదటి ముద్రణ:1984)

★★★★★